క్లుప్తంగా...

నేడు వినాయక చవితి ఏర్పాట్లపై సమీక్ష

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో వినాయక చవితి పండుగ సందర్భంగా సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేష్‌లు ప్రకటించారు. నేడు ఉదయం 9.45 గంటలకు రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఉపకమిషనర్ రవికుమార్ ఆధ్వర్యంలో వినాయక చవితి నిమజ్జనానికి తగిన ఏర్పాట్లకు సన్నాహక సమావేశ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

స్వచ్ఛత బ్రాండ్ అంబాసిడర్‌గా శివారెడ్డి


సినీనటుడు శివారెడ్డి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ స్వచ్ఛత బ్రాండ్ అంబాసిడర్‌గా సినీనటుడు, మిమిక్రీ ఆర్టిస్టు శివారెడ్డి వ్యవహరిస్తారని మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి ప్రకటించారు. ఆయన ఆధ్వర్యంలో స్వచ్ఛత పాటించడం అవసరాన్ని తెలియజేస్తూ.. ఈనెల 17న గండిపేట చెరువు వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, మహిళలు ఉదయం 9.30గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థినులకు ఉచిత బస్‌పాస్‌లు

శంషాబాద్: పట్టణంలోని పలు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న బాలికలకు మేకల సత్యనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బస్‌పాస్‌లను అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు మేకల పవన్ మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులకు అండగా ఉండేందుకు మేకల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సమాజాభివృద్ధికి బాలికల విద్యనే అత్యంత ప్రధానమైందన్నారు. రాజేంద్రనగర్ బస్‌డిపో మేనేజర్ శ్రీనాథ్, శంషాబాద్ బస్‌స్టేషన్ కంట్రోలర్ ప్రేమలత, మల్లేష్, పవిత్ర సాగర్, రోహిత్ తదితరులున్నారు.

సీబీఐటీ ప్రొఫెసర్‌కు పురస్కారం


రామకృష్ణను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహులు


మణికొండ: సీబీఐటీ కళాశాల ఐటీ విభాగం ప్రొఫెసర్ కె. రామకృష్ణకు రాష్ట్ర ప్రభుత్వం, భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జగతి ఆర్ట్స్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయ రత్న–2023 పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయనను ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు ప్రత్యేకంగా సత్కరించి, అభినందించారు. ఉపాధ్యాయ రత్న పురస్కారం దక్కటం హర్షణీయమన్నారు. కళాశాల పీఆర్‌ఓ డాక్టర్ జీఎస్‌ఆర్ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సొంత నిధులతో ప్యాచ్‌వర్క్స్


పనులను పరిశీలిస్తున్న సదాల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: ప్రజలకు సేవ చేసేందుకు తనవంతు బాధ్యత వహిస్తున్నామని తెలంగాణ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు సదాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదర్శనగర్‌కాలనీలో తన సొంత డబ్బుతో ప్యాచ్‌వర్క్స్‌లను గురువారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గోతులమయంగా రోడ్లు మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గణేష్ పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆదర్శనగర్‌లో రోడ్లకు ప్యాచ్‌వర్క్స్‌ను సొంత నిధులతో చేయించామన్నారు.

నియామకం


రఘునాథ్‌యాదవ్

గచ్చిబౌలి: సెప్టెంబర్16, 17న హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ సమావేశాలు, విజయభేరీ సభ జరగనున్నాయి. ఈ సమావేశాలకు శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రఘునాథ్ యాదవ్‌ను పబ్లిసిటీ, బ్రాండింగ్ కమిటీ కన్వీనర్‌గా నియమించింది. కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి రఘునాథ్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఫుట్‌పాత్‌లను పట్టించుకోరా !

ఫుట్‌పాత్ ఆక్రమణలతో పాదచారులకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. ఈ ఆక్రమణలతో తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా . అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాదచారులకు సౌకర్యంగా ఉండేందుకు ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను కొంతమంది కబ్జా చేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారని వాపోతున్నారు.


రోడ్డు పక్కన పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు

- యథేచ్ఛగా ఆక్రమణలు.. వ్యాపారాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

బండ్లగూడ: గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రధాన రహదారి తెలంగాణ పోలీస్ అకాడమీ నుంచి టీఫ్‌ఖాన్‌పూల్ బ్రిడ్జి వరకు ఉన్న ఫుట్‌పాత్‌పై వ్యాపారాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఈ ఆక్రమణలపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే లేకపోవడంతో పాదచారులు రోడ్లపైనే నడుస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్యవేక్షణ లోపం..

ఫుట్‌పాత్‌లపై పాదచారులు నడవలేని విధంగా పూర్తిగా ఆక్రమణలు జరుగుతున్న పట్టించుకొనే వారు కరువయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. ఓ వైపు ఫుట్‌పాత్ ఆక్రమణకు గురికావడమే కాకుండా వారి వద్ద నుంచి కొనుగోలు చేస్తున్న వినియోగదారులు తమ వాహనాలను ఇష్టానుసారంగా పార్కు చేయడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి తీవ్ర అంతరాయం కలుగుతోంది. పర్యవేక్షణ లేకపోవడంతోనే ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు జరుగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.

జాతీయ రహదారి కావడంతో రద్దీగా..

పోలీస్ అకాడమీ నుంచి టీఫ్‌ఖాన్‌పూల్ బ్రిడ్జి వరకు జాతీయరహదారి కావడంతో రద్దీ అధికంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో రోడ్డును దాటే పరిస్థితి కనిపించడం లేదంటే ట్రాఫిక్ ఏ మేర ఉంటుందో అర్థమవుతోంది. జాతీయ రహదారిపైనే కబ్జాలు జరుగుతున్నా అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

పక్కా ప్రణాళికతో..

ట్రాఫిక్ అధికారులు నామమాత్రంగా ఆక్రమణలను తొలగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తిరిగి మరునాడే కబ్జాదారులు ఫుట్‌పాత్‌లపై దర్జాగా వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. సరైన ప్రణాళికతో కబ్జాదారులపై తగిన చర్యలు చేపట్టి ఫుట్‌పాత్‌లను పాదాచారులకు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు స్థానికులు కోరుతున్నారు. పోలీస్ అకాడమీ ఎదురుగానే వ్యాపారాలు కొనసాగించడం గమనార్హం.


ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు ఇలా..

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి


చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరీశంకర్ కోరారు. గురువారం సౌత్‌జోన్ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నకు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అంజదేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు సీసీరోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని జోనల్ కమిషనర్‌ను కోరామన్నారు. వారు సానుకూలంగా స్పందించి పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. బీజేపీ నాయకులు బీటుకూరి సిద్దేశ్వర్, వెంకటేష్ తదితరులున్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్షలు


దీక్షలో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: నియోజకవర్గ పరిధిలో ఎస్సీ వర్గీకరణ సాధనకు రిలే నిరాహార దీక్ష గురువారంతో మూడో రోజుకు చేరింది. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని డిమాండ్ చేస్తూ.. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్‌లోని బీజేఆర్ విగ్రహం వద్ద నిరాహార దీక్షను చేపడుతున్నారు. నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి అరుణ్‌కుమార్‌మాదిగ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ దీక్షలో పలు పార్టీల నాయకులు మద్దతు తెలిపి దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్‌లో జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. రమేష్‌మాదిగ, కృష్ణ, పోచయ్య, సందీప్‌రెడ్డి, నర్సింహ్మా, సురేష్, రమచందర్, శేఖర్, సంజీవ, శ్రావణ్, రత్నం, దశరథ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, కోరని సదానందం, సత్యనారాయణముదిరాజ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బాబురావు, శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్, నర్సింగ్‌రావు తదితరులున్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీ టీచర్లను పర్మినెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాటేదాన్‌లోని బీజేపీ కార్యాలయంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, కార్మికులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26 వేలతో పాటు వారిని పర్మనెంట్ చేయాలన్నారు. ఈఎస్‌ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కాళోజీకి ఘన నివాళి

రాయదుర్గం: తెలంగాణలో తెలుగు భాషా చైతన్యాన్ని పెంపొందించడంలో కాళోజీ పాత్ర చిరస్మరణీయమని ప్రముఖ సాహితీ విమర్శకులు, హెచ్‌సీయూ ప్రొఫెసర్ పిల్లల మర్రి రాములు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని తెలుగు శాఖ ఆధ్వర్యంలో గురువారం కాళోజీ జయంత్యుత్సవాలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. సామాజిక చైతన్యానికి, ఉద్యమానికి ప్రతీకగా కాళోజీ నిలిచారన్నారు. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కాళోజీ నారాయణరావు తెలంగాణ, తెలుగు భాష కోసం పోరాడిన వ్యక్తులలో అగ్రగణ్యులన్నారు. ఈ సమావేశానికి ఆచార్యులు డాక్టర్ భూక్యా తిరుపతి, ఆచార్య విజయలక్ష్మి స్వాగతం పలికి వందన సమర్పణ చేశారు. సమావేశంలో ఆచార్యులు గోనానాయక్, డాక్టర్ బాణాల భుజంగరెడ్డి, డాక్టర్ విజయకుమారి, డాక్టర్ శంకర్‌అనంత పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీల సేవలు హర్షణీయం


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఫల్గుణ్‌కుమార్

మణికొండ: దేశవ్యాప్తంగా బ్రహ్మకుమారీలు సమాజహితం కోసం చేపడుతున్న అనేక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు అమోఘమని మణికొండ మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్ అన్నారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నేతాజీ పార్కులో బ్రహ్మకుమారీస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందికి కుటుంబాన్ని సమర్థవంతంగా నిర్వహించే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కువ మంది కుటుంబాలకు సరైన సమయం ఇవ్వకపోవటంతో అనేక అనర్థాలు జరుగుతున్నాయన్నారు. వాటిని అర్థం చేసుకుని ముందుకు వెళ్తేనే భవిష్యత్తులో కుటుంబ వ్యవస్థ ఉంటుందన్నారు. లేదంటే ప్రాశ్చాత్య దేశాల మాదిరిగా వివాహాలు చేసుకోవటమే మానేస్తారన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరమన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్ వసంతరావు, బ్రహ్మకుమారీస్ మణికొండ శాఖ కో– ఆర్డినేటర్ లక్ష్మీ బహెన్, బీకే శక్తి బహెన్, బీకే సుమలత బహెన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు ఓటుహక్కును కలిగి ఉండాలి


మాట్లాడుతున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలు రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును కలిగి ఉండాలని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. శాస్త్రీపురంలోని ఓవైసీహిల్స్‌లో ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కొత్త ఓటర్లను నమోదు చేసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండాలన్నారు. ప్రజలు ఎన్నికల్లో విలువైన ఓట్లను ఉపయోగించుకోవడం కోసం ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ.. వారిని జాగృతం చేస్తున్నామన్నారు. ఓటరు నమోదులో ఎలాంటి సందేహాలున్నా టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్ చేసి నివృత్తి చేసుకోవాలన్నారు. ఏసీపీ, మైలార్‌దేవపల్లి పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

‘మనూ’లో అధునాతన బోధనలపై ‘ఎఫ్‌డీపీ’

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో అధునాతన బోధనలపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగామ్(ఎఫ్‌డీపీ) నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఉర్దూ మీడియం టీచర్స్(సీపీడీయూఎంటీ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ సమీ సిద్ధిఖీ గురువారం తెలిపారు. సీపీడీయూఎంటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 9 నుంచి 21వ తేదీ వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రెండు వారాలపాలు ఆన్‌లైన్ లాంగ్వేజ్ డెవలప్‌మెంట్ ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.500 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఫారమ్‌తోపాటు ఇచ్చిన బ్యాంక్ వివరాలపై చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారికి ఈ సర్టిఫికెట్లను అందించడం జరుగుతుందన్నారు. వివరాలకు సెంటర్ ఫ్యాకల్టీ మిస్బాఅంజార్(9948412484), మహ్మద్ అక్బర్(8373984391)లో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

కాంట్రాక్టు ఉద్యోగుల వినూత్న నిరసన


సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత మాస్క్‌లతో నిరసన చేస్తున్న ఎస్‌ఎస్‌ఏ కాంట్రాక్టు ఉద్యోగులు

శంషాబాద్: సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత మాస్క్‌లతో ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులు గురువారం వినూత్న నిరసన చేశారు. గత 15 రోజులుగా మండల వనరుల కేంద్రంలో నిరసన దీక్షలు చేపడుతున్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 15 ఏళ్లకు పైగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు అతి తక్కువ వేతనాలకే పనిచేస్తున్నారన్నారు. సీఎం గతంలో ఇచ్చిన హామీ మేరకు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు


బుద్వేల్‌లో మరమ్మతులు చేయిస్తున్న పెండ్యాల సాయిమాలిక్

రాజేంద్రనగర్: ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి ప్రాధాన్యతకు అనుగుణంగా పరిష్కరిస్తున్నామని బీఆర్ఎస్ నాయకులు, శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెండ్యాల సాయిమాలిక్ అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్ గ్రామంలో గుంతలమయమైన రోడ్లకు మరమ్మతు పనులను చేయించి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, గుంతలమయంగా మారిన రోడ్లతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు.

9 ఏళ్లు.. రూ.9 వేల కోట్ల అభివృద్ధి

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 9 ఏళ్ల కాలంలో రూ.9వేల కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టినట్లు ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలోని గౌర్రెంకబస్తీ, కట్టెలబస్తీ, ఈగబస్తీ, ఎస్సీకాలనీ, ఇండ్లబస్తీ, పోచమ్మ బస్తీలలో పాదయాత్రను మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనకు, ప్రతి కాలనీ, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు, అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్లు, ప్రధానరోడ్ల విస్తరణ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేయడం జరిగిందని ఆయన వివరించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతోనే పెద్ద ఎత్తున నిధులను కేటాయించడంతోనే ఈ స్థాయిలో అభివృద్ధి సాధ్యమయ్యిందన్నారు. చేసిన అభివృద్ధిని చూసి మరోసారి బీఆర్ఎస్ పార్టీకి అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా


సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు


హైదర్‌గూడ సర్దార్ పటేల్ విగ్రహం వద్ద..


సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం..


నార్సింగిలో.. అంజన్‌కుమార్ గౌడ్


పుప్పాలగూడలో.. నరేందర్‌రెడ్డి తదితరులు

అత్తాపూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గురువారం హైదర్‌గూడ సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యదర్శి కొముర‌య్య, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీతాగౌరీశంకర్, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు సాబాద విజయ్‌కుమార్, రాచూరి రాజశేఖర్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సులిగే వెంకటేష్, మణికంఠ, రాజుపైల్వాన్, సిద్దేశ్వర్, కిరణ్, అనురాధా, బీబీనగర్ శశికాంత్‌శర్మ, విశాల్, ఠాగూర్ తదితరులున్నారు.

మైలార్‌దేవ్‌పల్లి: 9 ఏళ్ల రాష్ట్ర ప్రభుత్వ పాలనలో ప్రజలకు అన్యాయం చేస్తుందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి తలపెట్టిన 24 గంటల ఉపవాస దీక్షను పోలీసులు బలవంతంగా భగ్నం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ వైఖరికి నిరసగా మైలార్‌దేవ్‌పల్లి కాటేదాన్ చౌరస్తాలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజలకు న్యాయం చేయాలని పోరాడుతున్న బీజేపీ మీద పోలీసులతో అక్రమ అరెస్టులు చేయిస్తూ.. అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నియోజకవర్గ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి జోగి రవి, బుచ్చిరెడ్డి, చిన్న, పాండుయాదవ్, సంతూగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, ఎల్.వీ.రెడ్డి, బబ్లూ, కల్యాణ్‌రెడ్డి, నవీన్, మజార్, నర్సింహ్మారెడ్డి, మధుసూదన్, రమేష్‌రెడ్డి, మోహన్, వల్లూరి శ్రీనివాస్, రామరావు, లంకలసాయి, లక్ష్మీ, శరణమ్మ, సీ.హెచ్.ప్రభుదాస్, శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

శంషాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి దీక్ష భగ్నం చేయడానికి నిరసనగా బీజేపీ నేతలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా, పట్టణ అధ్యక్షుడు దేవేందర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం..

మణికొండ: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్ కుమార్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు, మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నార్సింగి అంబేద్కర్ చౌరస్తా, పుప్పాల్‌గూడ చౌరస్తాలలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మలను దహనం చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రజల గొంతుకగా ఉండే ప్రతిపక్షాలను ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకుండా ముందస్తు అరెస్టులు, దర్నాలు, నిరసనలు చేపట్టే అవకాశం లేకుండా రజాకార్ల పరిపాలన రాష్ట్రంలో కొనసాగుతుందని విమర్శించారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల అధ్యక్షులు సీహెచ్. భిక్షపతియాదవ్, బీరప్ప, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా కార్యవర్గసభ్యులు నగేష్‌యాదవ్, ఎం.రాఘవరెడ్డి, కౌన్సిలర్ ఆర్. ఆదిత్యరెడ్డి, కో– ఆప్షన్ సభ్యుడు జె.సిద్దప్ప, నాయకులు శంకర్‌సింగ్, కె.నరసయ్య చారి, బి.రవికాంత్‌రెడ్డి, బి.శివకుమార్, ఆనంద్‌రావు పాల్గొన్నారు.